Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్ సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 274
పేజీలు : 3
శనివారం 02.05.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

## హర్మ్యూజ్ జలసంధిలో పడిపోయిన రవాణా!



**టి మీడియా, మే 1 , ఢిల్లీ బ్యూరో**

పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో వ్యూహాత్మకమైన హర్మ్యూజ్ జలసంధి గుండా నౌకాయానం గణనీయంగా క్షీణించింది. ఈ సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచి హర్మ్యూజ్ జలసంధిలో రవాణా 90 శాతానికి పైగా పడిపోయింది. మార్చి 1 నుంచి ఏప్రిల్ 27 మధ్య హర్మ్యూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడులు, వేధింపులు, ప్రమాదాల నుంచి త్రుటిలో తప్పిపోవడం వంటి 40కి పైగా సంఘటనలు జరిగాయి. ఈ మేరకు రాయల్ నేవీ నేతృత్వంలోని పర్యవేక్షణ సంస్థ అయిన యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (యూకేఎమ్‌టీఓ) ఓ ప్రకటనలో తెలిపింది.

“పశ్చిమాసియా ఘర్షణల వల్ల హర్మ్యూజ్ జలసంధి తీవ్రంగా ప్రభావితం అయ్యింది. ఆ జలసంధి గుండా ప్రయాణించే నౌకలు, అందులోని సిబ్బంది నేరుగా దెబ్బతిన్నారు. అదే సమయంలో అనేక నౌకలపై దాడులు జరిగాయి. వాటిని హర్మ్యూజ్ నుంచి బలవంతం వెనక్కి వెళ్లేలా దాడులు చేశారు. వాణిజ్య నౌకలపై ప్రత్యక్ష దాడులకు సంబంధించిన కనీసం 26 సంఘటనలు జరిగాయి” అని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ప్రకటనలో పేర్కొంది.

### ‘హర్మ్యూజ్‌ను నౌకలు సురక్షితంగా దాటలేకపోతున్నాయి’

పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా 850- 870 పెద్ద వాణిజ్య నౌకలు గల్ఫ్‌లోనే చిక్కుకుపోయాయని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (ఖఖమీఉ) హెడ్ కమాండర్ జో బ్లాక్ తెలిపారు. ఈ ఇరుకైన జల మార్గంలో భద్రతాపరమైన ప్రమాదాల వల్ల అవి సురక్షితంగా బయటకు వెళ్లలేకపోతున్నాయని పేర్కొన్నారు. తమ మొదటి ప్రాధాన్యం సముద్రయాన సిబ్బంది భద్రత, రక్షణేనని వెల్లడించారు. సుమారు 20,000 మంది నావికులు ఎక్కడికీ వెళ్లలేని నౌకల్లో చిక్కుకుపోయారని స్పష్టం చేశారు. నౌకల్లోని సిబ్బంది తరచుగా మారడం లేదన్నారు. దీంతో వారిపై ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు. ఈ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగితే సముద్రయాన సిబ్బంది మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

### రాయల్ నేవీ మద్దతుతో వర్క్

9/11 దాడుల అనంతరం యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ప్రారంభమైంది. రాయల్ నేవీ మద్దతుతో ఇది పనిచేస్తోంది. ఎర్ర సముద్రం, గల్ఫ్ ప్రాంతం, ఉత్తర హిందూ మహాసముద్రంలో రవాణా చేసే నౌకలకు కీలకమైన సముద్ర భద్రతా సమాచార కేంద్రంగా సేవలు అందిస్తోంది. ఏఐఎస్ ట్రాకింగ్ వ్యవస్థలు, ఓడల స్వచ్ఛంద నివేదికలు, ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్‌పై ఆధారపడే ఈ సంస్థ, గతంలో సోమాలియా సముద్రపు దొంగల ఘటనలు, ఎర్ర సముద్రంలో ఇటీవలి ముప్పుల సమయంలో కీలక పాత్ర పోషించింది.

ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు జరిపాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణించారు. దీంతో అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. దీనికి ప్రతిగా టెహ్రాన్ పశ్చిమాసియాలోని ఇజ్రాయెల్, అమెరికా ఆస్తులపై ప్రతీకార దాడులు చేసింది. ఈ ఉద్రిక్తతలకు ముందు హర్మ్యూజ్ జలసంధి గుండా ప్రతిరోజూ సుమారు 130 నౌకలు ప్రయాణించేవి. అయితే ఇప్పుడు ఆ సంఖ్య రోజుకు 10 కంటే తక్కువకు పడిపోయింది. దీంతో ప్రపంచంలోని అత్యంత కీలకమైన సముద్ర మార్గాలలో ఒకటైన హర్మ్యూజ్ జలసంధి దాదాపుగా స్తంభించిపోయింది. హర్మ్యూజ్ జలసంధి ఒక కీలకమైన ప్రపంచ ఇంధన రవాణా మార్గం. వాషింగ్టన్, టెహ్రాన్‌ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఈ మార్గంలో ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరా గొలుసులపై తీవ్ర అంతరాయాలు ఏర్పడ్డాయి.

### ఇరాన్‌పై అమెరికా దాడి చేయనుందా?

యూఎస్-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అమల్లోకి ఉన్నప్పటికీ ఇరు దేశాల పరస్పరం హెచ్చరికలు చేసుకుంటున్నాయి. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అమెరికా నుంచి ఇజ్రాయెల్‌కు భారీగా సైనిక సామగ్రి చేరుకుంది. దీంతో ఇరాన్‌పై మరోసారి భీకర దాడులకు అమెరికా సిద్ధమవుతోందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా, ఇటీవలే ఒక్క రోజు వ్యవధిలోనే అమెరికా నుంచి 6,500 టన్నుల సైనిక సామగ్రి అందినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వశాఖ ప్రకటించింది. రెండు కార్గో నౌకలు, పలు విమానాల్లో ఈ సామగ్రి వచ్చిందని స్పష్టం చేసింది. ఈ కార్గో నౌకలు అష్‌దోద్, హైఫా పోర్టుల్లో ఉన్నాయని వెల్లడించింది.



## రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు

- స్వీకరించిన సీవీ ఆనంద్

**టి మీడియా, మే 1 , హైదరాబాద్ బ్యూరో :**

రాష్ట్రంలో శాంతి భద్రతల కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలంగాణ నూతన డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. కొత్త టెక్నాలజీని మరింతగా వాడుకుంటూ సమర్థంగా పనిచేస్తామన్నారు. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తామని చెప్పారు. నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శాంతిభద్రతల్లో సమస్య రాకముందే అప్రమత్తంగా ఉండటం మంచిదని అన్నారు. నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పనితీరు కనబరిచారని ఆయన తెలిపారు. మారుతున్న పరిస్థితుల్లానే నేరాలు జరిగే తీరులోనూ మార్పులు వస్తున్నాయన్నారు. నేరగాళు కొత్త కొత్త టెక్నాలజీని వాడుతూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వారు అనుసరిస్తున్న టెక్నాలజీ పోలీసులకు కూడా సవాలు విసురుతుందన్నారు.అంతకు ముందు కుటుంబ సభ్యులతో కలిసి సీవీ ఆనంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం పలికారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌నకు చెందిన సీవీ ఆనంద్ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి ఇటీవలే ట్రాన్స్‌ఫర్ అయ్యారు. హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్‌గా(డీజీపీగా) ఇవాళ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన పోలీస్‌శాఖలోని పలు కీలక విభాగాల్లో సేవలందించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా రెండు విడతల్లో పనిచేశారు. ఇంతవరకు డీజీపీగా ఉన్న శివధర్ రెడ్డి పదవీకాలం నిన్నటితో ముగియడంతో సీవీ ఆనంద్‌ను ప్రభుత్వం నూతన పోలీస్ బాస్‌గా నియమించింది. ఇటీవలే యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) డీజీపీ పోస్టుకు అర్హులైన ఐపీఎస్ అధికారుల జాబితాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించిన విషయం తెలిసిందే. ఆ జాబితాలో సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యమిశ్రా ఉన్నారు. ఈ ముగ్గురిలో అత్యంత సీనియర్ అయినటువంటి సీవీ ఆనంద్‌ను డీజీపీగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

### చిన్ననాటి నుంచే క్రమశిక్షణకు మారుపేరుగా

నూతన డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్ రంగారెడ్డి జిల్లాలోని హయత్?నగర్ సమీపంలోని కుంట్లూరు గ్రామంలో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. ఆయన బాల్యం నుంచే ఎంతో క్రమశిక్షణగా పెరిగారు. తండ్రి దామోదర్ రెడ్డి ప్రభుత్వ అధికారి కావడంతో పరిపాలనపై చిన్ననాటి నుంచే అవగాహన ఏర్పడింది. ప్రముఖ స్కూళ్లలో ఒకటైన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు. నిజాం కాలేజీలో డిగ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ విద్యను పూర్తి చేశారు. అనంతరం 1991లో సివిల్స్ పరీక్ష రాసి ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు.

### పోలీసింగ్‌లో ఎన్నో మార్పులకు ఆధ్యుడు

సీవీ ఆనంద్ తన కెరీర్ ప్రారంభంలోనే 10 సంవత్సరాల పాటు వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ లాంటి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించడం ఆయనలోని పోరాట పటిమను చాటింది. ప్రాణాలకు తెగించి మరీ కీలక ఆపరేషన్లను లీడ్ చేసినందుకుగాను ఆయనకు 2002లోనే ప్రెసిడెంట్ గ్యాలెంటరీ మెడల్ అందుకున్నారు. హైదరాబాద్ ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాల్లో ఆయన ప్రవేశపెట్టిన పలు కీలక మార్పులు నేటికీ ఆదర్శంగా ఉన్నాయి.నగరంలోని రోడ్లపై ప్రమాదాలను తగ్గించేందుకు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలను పెంచి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకున్నారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను వాడుకుంటూ ఈ-చలాన్, స్పీడ్ గన్ వ్యవస్థలను ప్రాచుర్యంలోకి తెచ్చారు. సైబరాబాద్ కమిషనర్‌గా పనిచేస్తున్న సమయంలో షీ టీమ్స్, షీ షటిల్స్ తదితర వినూత్న కార్యక్రమాలతో ఐటీ కారిడార్‌లో మహిళలకు భరోసానిచ్చారు. ఎండలో విధులు నిర్వహించే కానిస్టేబుళ్లకు సన్ గ్లాసెస్ పంపిణీ చేయడమే కాకుండా అనేక కీలక సంస్కరణలకు ఆద్యుడిగా నిలిచారు.

## అసెంబ్లీకి సీఎం తాగొచ్చారు

### విపక్షాల సంచనల ఆరోపణలు



**టి మీడియా, మే 1 , ఢిల్లీ బ్యూరో :**

మేడేను పురస్కరించుకొని పంజాబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అసెంబ్లీ సమావేశం రాజకీయ దుమారాన్ని రేపింది. ఈ సమావేశం ఆశించిన లక్ష్యం పక్కకు పోయి, ముఖ్యమంత్రి భగవంత్ మాన్ వ్యక్తిగత ప్రవర్తన అంశం చర్చనీయాంశమైంది. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మద్యం సేవించి అసెంబ్లీకి వచ్చారని ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు సభలో పెను దుమారం రేగింది. ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్, శిరోమణి అకాలీదళ్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. అందరికీ బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయాలని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. ఇదే సమయంలో భగవంత్ మాన్ ప్రసంగించేటప్పుడు మద్యం మత్తులో తూగుతున్నట్లు, మాట తుల్లినట్లు కనిపించే వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవడం మరింత సంచలనంగా మారింది.

ఈ రోజు అసెంబ్లీలో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మద్యం సేవించి కనిపించారు. ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన సీఎం భగవంత్ ప్రవర్తన శాసనసభ గౌరవాన్ని దిగజార్చింది. సభలో అనుచితంగా ప్రవర్తించినందుకు గానూ ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను కోరుతున్నాం. అలాగే, సీఎం భగవంత్ మాన్‌కు మద్యం పరీక్షలు నిర్వహించాలని స్పీకర్ సంధ్వాన్‌ను డిమాండ్ చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశాం. అవసరమైతే మద్యం పరీక్షలకు మేం కూడా సిద్ధం” అని కాంగ్రెస్ నాయకుడు సుఖ్‌పాల్ సింగ్ ఖైరా ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

### ‘రాష్ట్రాన్ని నడిపే వ్యక్తి ఇలా చేయడం బాధాకరం’

అలాగే, అసెంబ్లీ ప్రతి పక్ష నాయకుడు ప్రతాప్‌సింగ్ బజ్వా కూడా ఈ విషయంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి మద్యం మత్తులో అసెంబ్లీకి వస్తే తామేం 3లో..

## శుభక్షేత్ర వెంచర్ పేరుతో డబ్బులు వసూలు

3లో..




# కౌంటింగ్‌పై అనుమానాలకు తావులేదు

- **సీసీకెమెరాలను ఆఫ్ చేయలేదు : బంగాల్ సీఈఓ**

**టి మీడియా, మే 1 , ఢిల్లీ బ్యూరో :**
బంగాల్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై తృణమూల్ కాంగ్రెస్ చేసిన ఆరోపణలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ఖండించారు. మొత్తం లెక్కింపు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిబంధనల ప్రకారమే జరుగుతుందని స్పష్టం చేశారు. కౌంటింగ్ హాళ్లు, స్ట్రాంగ్ రూములు, ప్రవేశ ద్వారాలు సహా అన్ని కీలక ప్రాంతాల్లో నిఘా కొనసాగుతోందని ఆయన వెల్లడించారు. కౌంటింగ్ ప్రక్రియ 100 శాతం నిబంధనలకు అనుగుణంగా, అత్యంత కచ్చితత్వంతో జరుగుతుందని సీఈఓ హామీ ఇచ్చారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే ప్రతి రౌండ్ లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తున్నామని చెప్పారు. అయితే కొన్ని కౌంటింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు నిలిపివేశారని, లెక్కింపులో పారదర్శకత లోపించిందని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం వెంటనే స్పందించి, అలాంటి ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పింది.

**పూర్తి విశ్వాసం ఉంచాలి!**
ఎన్నికల ప్రక్రియపై ప్రజలు, రాజకీయ పార్టీలు పూర్తి విశ్వాసం ఉంచాలని సీఈఓ కోరారు. పారదర్శకత, నిష్పక్షపాతతకు ఎన్నికల సంఘం కట్టుబడి ఉందని, ప్రతి ఓటు విలువను కాపాడటం తమ బాధ్యత అని పేర్కొన్నారు. కోల్‌కతాలోని ఖుదిరామ్ అనుషీలన్ కేంద్రంలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూములు ఉన్నాయని అధికారులు తెలిపారు. పోలింగ్ ముగిసిన




అనంతరం అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, సాధారణ పరిశీలకుల సమక్షంలో వాటిని మూసివేసి సీల్ చేసినట్లు వెల్లడించారు. చివరి స్ట్రాంగ్ రూమ్‌ను గురువారం(30-04-2026) ఉదయం సుమారు 5.15 గంటలకు సీల్ చేసినట్లు పేర్కొన్నారు.

**బ్యాలెట్ల కోసం ప్రత్యేక స్ట్రాంగ్ రూమ్**
కాగా అదే ప్రాంగణంలో పోస్టల్ బ్యాలెట్ల కోసం ప్రత్యేక స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ సిబ్బంది, ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీబీపీఎస్?) ద్వారా వచ్చిన పోస్టల్ బ్యాలెట్లను అసెంబ్లీ వారీగా వర్గీకరించే ప్రక్రియ మాత్రమే జరుగుతోందని వివరించారు. ఈ ప్రక్రియను ప్రధాన స్ట్రాంగ్ రూముల వెలుపల కారిడార్‌లో నిర్వహించారని స్పష్టం చేశారు.

**ఈ-మెయిల్ ద్వారా సమాచారం**
దీని గురించి రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు) అన్ని రాజకీయ పార్టీలకు ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లకు కూడా దీనిపై ముందుగానే తెలియజేసినట్లు పేర్కొన్నారు. బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కై సంబంధిత పార్టీల ప్రతినిధులు లేకుండానే బ్యాలెట్ బాక్సులను తెరిచిందని టీఎంసీ ఆరోపించింది. ఇది ప్రజాస్వామ్య హత్యతో సమానమని విమర్శించింది. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఒక వీడియోను కూడా ఆ పార్టీ విడుదల చేసింది.

**ఇండోర్ స్టేడియం వెలుపల ధర్నా**
టీఎంసీ సీనియర్ నేతలు శశి పాంజా, కునాల్ ఘోష్ నేతాజీ ఇండోర్ స్టేడియం వెలుపల ధర్నాకు దిగారు. స్ట్రాంగ్ రూమ్‌లో తమ ప్రతినిధులను అనుమతించడం లేదని, పోస్టల్ బ్యాలెట్లతో చెలగాటమాడుతున్నారనే అనుమానాలు వ్యక్తం చేశారు. పారదర్శకత లోపించిందని ఆరోపించారు. తరువాత ధర్నాను విరమించిన కునాల్ ఘోష్, స్ట్రాంగ్ రూమ్ సీల్‌ను ముందస్తు సమాచారం లేకుండా తెరవడం ఎన్నికల సంఘం తప్పిదమని అన్నారు.

**అదనపు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు**
ఇకపై అధికారిక సమాచారం ఇవ్వకుండా స్ట్రాంగ్ రూమ్ సీల్‌ను తెరవమని ఈసీ హామీ ఇచ్చిందని తెలిపారు. అదనపు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరగా, అందుకు కూడా అధికారులు అంగీకరించినట్లు చెప్పారు. అయితే టీఎంసీ ఓటమికి ముందుగానే కారణాలు వెతుక్కుంటూ వదంతులు వ్యాప్తి చేస్తోందని బీజేపీ నేత తపస్ రాయ్ విమర్శించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడు స్థాయిల భద్రత ఉందని, తమ తరఫున కూడా ఇద్దరు ప్రతినిధులను పర్యవేక్షణకు నియమిస్తామని తెలిపారు.

# పూర్తయిన రోడ్డు నిర్మాణం

- **అందాలను ఆస్వాదిస్తూ రయ్ రయ్**

**టి మీడియా, మే 1 , మార్కాపురం :**
నల్లమల అడవుల్లో ప్రయాణం. అసలే ఘాట్ రోడ్. పైగా దారంతా గోతులే. రాత్రివేళ వెళ్లాలంటే వణుకే. ఎదురుగా వచ్చే వాహనానికి దారిచ్చే క్రమంలో పట్టు తప్పితే లోయలో పడే దుస్థితి. ఇన్ని కష్టాలకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ తెరదించింది. అడ్డంకులన్నీ అధిగమించి సుందరమైన రహదారిని నిర్మించింది. నల్లమల అందాలను ఆస్వాదిస్తూ వాహనదారులు రయ్ రయ్ మంటూ దూసుకెళ్తున్నారు



**యర్రగొండపాలెం-మాచర్ల మధ్య పూర్తయిన రోడ్డు నిర్మాణం**
మార్కాపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే నల్లమల అడవుల్లో ప్రయాణమే మార్గం. జిల్లాలోని యర్రగొండపాలెం నుంచి పల్నాడు జిల్లా మాచర్ల మధ్యలో ప్రమాదకర ఘాట్‌రోడ్డులో ప్రయాణించాల్సి ఉంటుంది. రేయింబవళ్లు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. పేరుకు జాతీయ రహదారే అయినా ఎప్పుడో నిర్మించిన రోడ్డు ధ్వంసమై దారంతా గోతులమయంగా మారింది. ముఖ్యంగా మల్లపాలెం నుంచి శిరిగిరిపాడు వరకు దాదాపు 20 కిలోమీటర్ల మేర నల్లమల అటవీ ప్రాంతంలో రోడ్డు మరీ దారుణంగా తయారైంది. అటవీశాఖ అనుమతులతో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఈ రోడ్డుకు మోక్షం కల్పించింది

**565వ జాతీయ రహదారిలో భాగంగా శరవేగంగా పనులు**
జాతీయ రహదారి 565గా పిలిచే ఈ రోడ్డు పనులు 2024లోనే దాదాపు పూర్తయినా. 20 కిలోమీటర్ల మేర ఘాట్ రోడ్డు నిర్మాణం పెండింగ్ పెట్టారు. అటవీశాఖ అనుమతులు, ఇతరత్రా కారణాలతో ఆరేళ్లపాటు ఈ పనులు ముందుకు సాగలేదు. 2024లో ఎట్టకేలకు రావడంతో పనులు ప్రారంభించి చకచకా పూర్తిచేశారు. భూసేకరణతో పాటు 393.61 కోట్ల రూపాయల నిధులతో ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. చిన్నాపెద్దా కలిపి 16 వంతెనలు నిర్మించారు.

**వన్యప్రాణుల కోసం దారిలో 8 అండర్ పాస్‌ల నిర్మాణం**
వన్యప్రాణుల కోసం ప్రత్యేకంగా 8 అండర్ పాస్‌లు నిర్మించారు. జంతువులు, పశువులు రోడ్డు పైకి రాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కొత్త రోడ్డుపై ప్రయాణం ఇప్పుడు సాఫీగా ఉందని వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఘాట్ రోడ్డులో 20 కిలోమీటర్ల ప్రయాణానికి గతంలో సుమారు గంట సమయం పట్టగా ఇప్పుడు 20 నిమిషాల్లోపే పూర్తవుతోంది. మలుపులు తొలగించడంతో 4 కిలోమీటర్ల మేర దూరం సైతం తగ్గింది. దట్టమైన నల్లమల అడవుల్లో కొండలు, లోయల మధ్య నిర్మించిన సుందరమైన రహదారిలో ప్రయాణం వాహనదారులకు మంచి అనుభూతి మిగుల్చుతోంది.

# వెలిమినేడులో పేలిన రియాక్టర్

- **9 మంది కార్మికులకు గాయాలు**

**టి మీడియా, మే 1 , హైదరాబాద్ బ్యూరో :**
మేడే రోజే కార్మికులకు ఘోర ప్రమాదం సంభవించింది. నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులోని నోష్ ఫార్మాల్యాబ్ లో శుక్రవారం జరిగిన పేలుడులో తొమ్మిది మంది కార్మికులు గాయపడ్డారు. కంపెనీలోని మూడవ బ్లాక్‌లో ఒక రియాక్టర్ పేలిపోవడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. రియాక్టర్ పేలిన తర్వాత ఆ బ్లాక్ అంతా దట్టమైన పొగతో నిండిపోయింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గాయపడిన కార్మికులను చికిత్స నిమిత్తం నార్కెట్‌పల్లిలోని కామినేని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కు తరలించారు. గాయపడిన కార్మికులలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. మే 1 కార్మిక దినోత్సవం నాడు కంపెనీలో పనిచేసిన కార్మికులు, కార్మిక సంఘాల నుండి విమర్శలను ఎదుర్కొన్నారు. ఇదే ఫార్మా కంపెనీలో ఏప్రిల్ 9న రెండో బ్లాక్‌లో




రియాక్టర్ పేలుడు సంభవించడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. 20 రోజుల్లో రెండోసారి ప్రమాదం జరిగడం విశేషం. వరస ప్రమాదాలు ప్రమాదాలు జరిగాయని కార్మికుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మేడే స్ఫూర్తితో కార్మికులు హక్కుల సాధనకై ఉద్యమించాలి

- **జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి. ఫయాజ్**

**టి మీడియా, మే 1 , కొల్లాపూర్ :**
నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన 141వ మేడే ఉత్సవాలుసిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి. ఫయాజ్ మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాలు, త్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మిక హక్కులు నేడు ప్రపంచీకరణ ప్రభావంతో ప్రమాదంలో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని విమర్శిస్తూ, వాటి రక్షణ కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సుమారు 140 సంవత్సరాల క్రితం సాధించిన ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేసి, పన్నెండు గంటల పని విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని కార్మికులను కోరారు. మేడే స్ఫూర్తితో ఎర్రజెండా కింద ఏకమై తమ హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, జిల్లా



కౌన్సిల్ సభ్యులు జి. కురుమయ్య, కొల్లాపూర్ పట్టణ కార్యదర్శి ఎం.డి. యూసుఫ్, కార్మిక సంఘాల నాయకులు సత్యం, గంగన్న, సత్యనారాయణ, చేపల శేఖర్, జి. వెంకటస్వామి, రామకృష్ణ, జూపూడి శంకర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐని సన్మానించిన బిఆర్ఎస్ నేతలు

**టీ మీడియా,మే1, పెబ్బేరు :**
లింగాల పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై పెబ్బేరు పోలీస్ స్టేషన్ కి వచ్చిన వెంకటేష్ గౌడ్ ను, వి దిలీప్ కుమార్ రెడ్డిఆధ్వర్యంలో పట్టణ బి ఆర్ ఎస్అ ధ్యక్షులు అందరు కలిసి సన్మానం చేయడం జరిగింది. అందరు కలిసి స్వీట్స్ తినిపించడం జరిగింది శాంతి భద్రతలను కాపాడాలని నిష్పక్ష పాతంగా పని చేయాలని శాంతి భద్రతలు కాపాడాలని సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా పోలీసు వ్యవస్థకు విశేష సేవలు అందించాలని తెలిపారు .ఈ కార్యక్రమంలో ఎద్దుల సాయినాథ్ శేఖర్ గౌడ్ ,సాయిరెడ్డి, రామన్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, ఎం రాములు, వసంత్ గోవర్ధన్ రెడ్డి , సిద్ధిరాములు ,మహేష్, బీసన్న వెంకటేష్, కుమ్మరి సురేష్, బిందెల హనుమంతు, శేఖర్, ఆచారి వెంకటరెడ్డి, షేకుల శీను, పర్వతాలు, మోతే హనుమంతు, సురేష్, కరణ్ ,తదితరులు పాల్గొన్నారు.



## మేడే స్ఫూర్తితో పోరాడుదాం

- **4 లేబర్ కోడ్‌ల రద్దుకు పిలుపు**

**టీ మీడియా, మే 1, పెబ్బేరు:**
పెబ్బేరు పట్టణంలో 140వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం పబ్లిక్ , ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీ బాలాజీ తుఫాన్ డ్రైవర్స్ యూనియన్ కార్యాలయంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి. ఊసన్న మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2014 నుండి కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. వందేళ్ల పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక హక్కులను నాలుగు లేబర్ కోడ్‌ల రూపంలో కుదించి కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా మార్చిందని ఆరోపించారు. అలాగే రవాణా రంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని, డ్రైవర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12,000 భృతి అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్, మహేష్ గౌడ్, భాస్కర్, గోవిందు, విన్న నాయుడు, రాముడు, బక్కన్న, పవన్, శివ, ఎల్లస్వామి, భూపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులను సన్మానించిన కౌన్సిలర్

**టీ మీడియా,మే1,పెబ్బేరు :**
పట్టణంలోఇటీవల ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 12వ వార్డుకు చెందిన భాషా దంపతుల కుమారుడు మహబూబ్ ఇంటర్లో ర్యాంక్ సాధించిన భాష కూతురు అప్ప సన్నజాజుల రాజు దంపతుల కుమారుడు ఆకాష్ కమ్మరి రాఘవాచారి దంపతుల కుమారుడు నిఖిల్ వల్లప్ రెడ్డి శ్రీధర్ రెడ్డి కుమారుడు రక్షిత్ రెడ్డి మంచి మార్కులు సాధించడంతో 12వ వార్డు కౌన్సిలర్ సౌజన్య దిలీప్ కుమార్ రెడ్డిస్పందించి తల్లిదండ్రులకు అభినందనలు తెలుపుతూ ఇంటికి వెళ్లి శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు ఇట్టి కార్యక్రమంలో సాయి రెడ్డి ఖదీర్ శేకరాచారి సాయి శ్రీనివాస్ రెడ్డి భతులరాజు శ్రీను సురేష్ తదితరులు పాల్గొన్నారు.




## వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ, మున్సిపల్ చైర్మన్

**టీ మీడియా, మే 1, పెబ్బేరు:**
పెబ్బేరు మండలంలో జరిగిన పలు వివాహ వేడుకల్లో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ కొత్త కాపు శివసేనా రెడ్డి, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. మార్కెట్ డైరెక్టర్ సూగూర్ నరసింహనాయుడు కుమార్తె రిసెప్షన్ వేడుక నిర్వహించగా, మున్సిపాలిటీకి చెందిన నెల్లికొండి సర్వేశ్వర్ గౌడ్ కుమారుడి వివాహం వల్లపు రెడ్డి కళ్యాణ మండపంలో జరిగింది. ఈ శుభకార్యాల్లో పాల్గొన్న అతిథులు నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తాటికొండ కృష్ణ, వెంకటేశాగరు, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, బుర్రమోని రాములు యాదవ్, భాను ప్రకాష్ రెడ్డి, రణధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సిలిండర్ల ధరలు పెరుగుతాయని ముందే చెప్పాను: రాహుల్ గాంధీ

**టి మీడియా, మే 1 , ఢిల్లీ బ్యూరో :**
వాణిజ్య ఎల్ పి జి సిలిండర్ల ధరల పెంపు నేపథ్యంలో కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్?సభ ప్రతిపక్ష నేత రాహుల్? గాంధీ విరుచుకుపడ్డారు. ఈ పెంపును తాను ముందే ఊహించానని అన్నారు. ఎన్నికల తర్వాత దేశీయ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు గురయ్యే అవకాశం ఉందని ఆరోపించారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు ధరలు రూ. 1,380 పెరిగాయని, ఇది కేవలం మూడు నెలల్లోనే 81శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఈ ధరల పెంపు ప్రభావం టీ స్టాల్స్, దాబాలు, హోటళ్లు, బేకరీలు, స్వీట్ షాపుల వంటి చిన్న వ్యాపారాలపై పడుతుందని అన్నారు. అలాగే గృహ ఖర్చులు కూడా ప్రభావితం అవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది ఎన్నికల బిల్లు అంటూ కేంద్రంపై విమర్శలు గుప్పించిన ఆయన, గ్యాస్ తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాగా, త్వరలోనే పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెరుగుతాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం అన్నారు. బంగాల్‌లో పోలింగ్ బుధవారంతో ముగుస్తుండటం, అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడులో ఇప్పటికే పోలింగ్ పూర్తయిపోవడంతో మోదీ ప్రభుత్వం త్వరలోనే పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెంచుతుందన్నారు. ప్రజలు పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. "ఎన్నికల ఉపశమనం ముగిసింది. ద్రవ్యోల్బణ తాపం వచ్చేస్తోంది! ఏప్రిల్ 29 తర్వాత జాగ్రత్త పెట్రోల్, డీజిల్, అన్నీ ఖరీదవుతాయి. చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు, మోదీ ప్రభుత్వం లాభాలను తన జేబులో వేసుకుంది. ఇప్పుడు ధరలు పెరిగాయి కాబట్టి, ఆ భారాన్ని మీపై మోపుతుంది. ధరలు తక్కువగా ఉన్నప్పుడు దోచుకునే ప్రభుత్వం, ద్రవ్యోల్బణ తీవ్రతను మాత్రం ప్రజలే భరించేలా వదిలేస్తుంది." అని రాహుల్? గాంధీ ఎక్స్?లో పోస్ట్ చేశారు.



**ప్రభుత్వం ఓటర్లను మోసం చేస్తోంది**
ఇదిలా ఉండగా, వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరల పెంపుపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ఓటర్లను మోసం చేస్తోందని, సామాన్యుడిపై భారం మోపుతోందని ఆయన ఆరోపించారు. ఎన్నికల తర్వాత ఈ చర్య ఊహించినదేనని, ఇది ప్రజలకు వెన్నుపోటు అని శివకుమార్ అభిప్రాయపడ్డారు. "ఇది సామాన్యుడిని, హోటళ్లను ప్రభావితం చేస్తుంది. వారు (బీజేపీ) ఈ దేశ ఓటర్లను మోసం చేశారు. ఎన్నికల తర్వాత వారు ఇలా చేస్తారని మాకు తెలుసు. ఇది ప్రజలకు వెన్నుపోటు పొడవడమే. మేము దీనిని ఖండిస్తున్నాం. ధరల పెంపును వెనక్కి తీసుకునేలా ఆందోళన చేస్తాం" అని అన్నారు.

**కార్మికులకు మోదీ ఇచ్చిన బహుమతి**
మరోవైపు వాణిజ్య సిలిండర్ల ధరల పెంపు నిర్ణయాన్ని సీపీఐ(ఎం) నాయకురాలు బృందా కారత్ తప్పుబట్టారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు ఇచ్చిన బహుమతిగా అభివర్ణించారు. "కార్మిక దినోత్సవం రోజు ఇది కార్మికులకు మోదీ ఇచ్చిన బహుమతి. కార్మికుల వేతనాల్లో ఎలాంటి పెరుగుదల లేకుండా ఎల్పీజీ ధర రూ. 3000కు చేరడం దేశంలోని లక్షలాది మంది పేదల జీవితాలపై ప్రభావం చూపబోతోంది. మోదీజీ సబ్సిడీల విషయంలో భారీగా వెచ్చిస్తున్నారు. ఇది కేవలం అంబానీ, అదానీల కోసమేనా లేక సామాన్య ప్రజల కోసమా?" అని ఆమె అన్నారు.

## వైభవంగా శ్రీలక్ష్మీ నృసింహుని తిరు కళ్యాణం

- **కళ్యాణానికి పోటెత్తిన భక్త జనం**

**టి మీడియా, మే 1 , మంగపేట:**
రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధి చెందిన ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామంలో శ్రీహేమాచల క్షేత్రంలో( మల్లూరు గుట్ట) నెలకొని ఉన్న శ్రీలక్ష్మీ నృసింహ స్వామి తిరు కళ్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదవ రోజైన శుక్రవారం ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.వీరాస్వామి పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అర్చకులు, శ్రీ హేమాచల ( మల్లూరు ) లక్ష్మీ నృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల నిర్వాహక పూజారులు అమరవాది మురళీ కృష్ణమాచార్యులు, వారి బృందం, శ్రీ హేమాచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు ముక్కామల రాజశేఖర శర్మ, అర్చకులు కారంపూడి పవనకుమారాచార్యులు, యేడునూతల ఈశ్వర చందు శర్మ, ముక్కామల వేంకట నారాయణ శర్మ ( బాబీ ), అనిపెద్ది రాజీవ్ నాగ శర్మ తదితరుల ఆధ్వర్యంలో తదితరుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీనృసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాల నడుమ కళ్యాణ మండపంకి తీసుకువచ్చి కళ్యాణ తంతు కార్యక్రమం ప్రారంభించారు. మధ్యాహ్నం 12.02 గంటలకు అభిజిత్ లగ్నంలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లతో శ్రీ లక్ష్మీనృసింహస్వామికి పాణిగ్రహణం ( జీలకర్ర బెల్లం) కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాంగల్య ధారణ కార్యక్రమం, ముత్యాలతో తలంబ్రాల కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను రాష్ట్ర మంత్రి సీతక్క స్వామి వారికి సమర్పించి కళ్యాణం తిలకించారు.



## లంచం అడిగిన చెకింగ్ ఇన్‌స్పెక్టర్

- **చెప్పుతో కొట్టిన కండక్టర్**

**టి మీడియా, మే 1 , హైదరాబాద్ బ్యూరో :**
సంగారెడ్డి జిల్లా రాయకోడ్ వద్ద హైదరాబాద్ నుండి నారాయణఖేడ్ వెళ్తున్న ఒక ఆర్టీసీ బస్సులో టికెట్ల తనిఖీ హింసాత్మకంగా మారడంతో, రైకోడ్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. అధికారులు సాధారణ తనిఖీ కోసం బస్సును ఆపి, సరైన టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న ఒక ప్రయాణికుడిని గుర్తించారు. నివేదికల ప్రకారం, ప్రయాణికుడిపైనా, కండక్టర్‌పైనా కేసు నమోదు చేయకుండా ఉండేందుకు టికెట్ ఇన్‌స్పెక్టర్ రూ. 20,000 లంచం డిమాండ్ చేశాడు. ఇది ప్రయాణికులలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఆ తర్వాత జరిగిన వాగ్వాదంలో, కండక్టర్, ఆ ప్రయాణికుడు కలిసి టికెట్ ఇన్‌స్పెక్టర్‌పై చెప్పులతో దాడి చేశారు.





## విహార నౌక బోల్తా

- **తొమ్మిదికి చేరిన మృతుల సంఖ్య**

**టి మీడియా, మే 1 , జబల్‌పూర్:**
మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జలాశయంలోబోల్తా పడిన క్రూయిజ్ బోటులో ప్రయాణిస్తున్న మరో ఐదుగురి మృతదేహాలను సహాయక సిబ్బంది వెలికితీయడంతో, బర్గి డ్యామ్ దుర్ఘటనలో మృతుల సంఖ్య శుక్రవారం నాటికి తొమ్మిదికి చేరింది. మధ్యప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి ధర్మేంద్ర భావ్ సింగ్ లోధి మీడియాతో మాట్లాడుతూ.... గురువారం నాలుగు మృతదేహాలు లభించగా, సహాయక చర్యల సమయంలో తెల్లవారుజామున మరో ఐదు మృతదేహాలు దొరికాయి. దీంతో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరిందన్నారు. ఇప్పటివరకు 22 మందిని రక్షించినట్లు పేర్కొన్నారు. సమగ్ర విచారణ చేపడతామని, ప్రాణాలతో బయటపడిన వారిలో ఒకరు లేవనెత్తిన లైఫ్ జాకెట్ల అంశంపై కూడా దర్యాప్తు చేస్తామని మంత్రి తెలిపారు. గురువారం సాయంత్రం అకస్మాత్తుగా సంభవించిన తుఫాను కారణంగా బర్గి డ్యామ్‌లో 29 మంది ప్రయాణికులు, ఇద్దరు సిబ్బందితో ప్రయాణిస్తున్న క్రూయిజ్ బోటు బోల్తా పడిందని అధికారులు తెలిపారు. గల్లంతైన ప్రయాణికుల కోసం రాత్రంతా గాలింపు, సహాయక చర్యలు కొనసాగాయని, ఇందులో సైన్యం, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు పాల్గొన్నాయని రాష్ట్ర మంత్రి రాకేష్ సింగ్ తెలిపారు.

## హైదరాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- **స్పాట్‌లోనే ఆరుగురు మృతి**

**టి మీడియా, మే 1 , హైదరాబాద్ బ్యూరో :**
హైదారబాద్ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శంషాబాద్‌లో సమీపంలోని ఓ ఆర్ ఆర్ఎక్సిట్ 16 వద్ద ఆగి ఉన్న ఓ లారీని వ్యాగనార్ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారుకు కూడా ఉన్నట్టు సమాచారం. సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. ఓవర్ స్పీడ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.



# 34 లక్షల అదనపు ఓట్లు ఫలితాలను మార్చనున్నాయా?

- ఏ పార్టీకి లాభం చేకూరనుంది?



**టి మీడియా, మే 1 , ఢిల్లీ బ్యూరో :**
బంగాల్ ఎన్నికల్లో ఈసారి నమోదైన పోలింగ్ శాతం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. 2021 ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఏకంగా 34 లక్షల మంది అదనంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అసలు ఇంత భారీ స్థాయిలో పోలింగ్ పెరగడానికి కారణం ఏంటి? ఆ 34 లక్షల మంది ఎవరి వైపు మొగ్గు చూపారు? ఇవే ప్రశ్నలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. మార్పు కోసమే జనం ఓటేశారని బీజేపీ అంటుంటే, అదంతా తమ ఓటు బ్యాంకేనని అధికార టీఎంసీ ధీమా వ్యక్తం చేస్తోంది. ఆసక్తికరంగా మారిన బంగాల్ పోలింగ్ లెక్కలపై ప్రత్యేక కథనం.

**'ఈ సారి ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 93 శాతం పోలింగ్ నమోదు'**

బంగాల్ ఎన్నికల రణక్షేత్రంలో ఈసారి ఓటర్లు భారీగా కదంతొక్కారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 5.98 కోట్ల మంది ఓటు వేయగా, ఈసారి ఆ సంఖ్య 6.31 కోట్లకు చేరింది. ఎస్ఐఆర్ పేరుతో ఎన్నికల సంఘం లక్షలాది నకిలీ ఓట్లను తొలగించినప్పటికీ, రికార్డు స్థాయిలో 93 శాతం పోలింగ్ నమోదవ్వడం గమనార్హం. కేవలం నకిలీ ఓట్ల ఏరివేత వల్లే కాకుండా, వాస్తవ ఓటర్ల సంఖ్య కూడా భారీగా పెరిగింది. గత ఎన్నికల్లో బీజేపీ కంటే టీఎంసీకి దాదాపు 60 లక్షల ఓట్లు ఎక్కువగా వచ్చాయి. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చి చేరిన ఈ 34 లక్షల అదనపు ఓట్లు విజయావకాశాలను తారుమారు చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

అయితే, పెరిగిన 34 లక్షల ఓట్లపై బీజేపీ పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉంది. దాదాపు రెండున్నర లక్షల మంది కేంద్ర బలగాల మోహరింపుతో బంగాల్‌లో భయానక వాతావరణం తొలగిపోయిందని, స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం దక్కడంతోనే జనం భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారని కమలనాథులు విశ్లేషిస్తున్నారు. ఇది కచ్చితంగా అధికార పార్టీకి వ్యతిరేక ఓటు అని, జనం మార్పు కోరుకుంటున్నారని చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో రెసిడెన్షియల్ సొసైటీల లోపలే పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడం కూడా ఓటింగ్ శాతం పెరగడానికి దోహదపడిందని, ఇది తమకు భారీగా కలిసొస్తుందని బీజేపీ అంచనా వేస్తోంది. మరోవైపు అధికార తృణమూల్ కాంగ్రెస్ కూడా ఈ అదనపు ఓట్లపై తనదైన శైలిలో వాదిస్తోంది. ఈ 34 లక్షల ఓట్లు ఎస్ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా పడిన నిరసన ఓట్లుగా టీఎంసీ అభివర్ణిస్తోంది. ఎక్కడ తమ ఓటు గల్లంతవుతుందోనన్న భయంతో తమ ఓటు బ్యాంకు మొత్తం ఏకతాటిపైకి వచ్చిందని, ఇందులో ఆందోళన చెందాల్సిన పనేమీ లేదని టీఎంసీ నేతలు చెబుతున్నారు. ఇది తమకు అనుకూలంగా జరిగిన 'ఓట్ కన్సాలిడేషన్' అని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇరు పార్టీలు తమదే విజయమంటున్న వేళ, అత్యంత కీలకమైన ఈ 34 లక్షల అదనపు ఓటర్లు ఎవరికి పట్టం కట్టారో తెలియాలంటే మే 4న వెలువడే ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

### బీజేపీ గెలుస్తుందని మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ అంచనా

ఇదిలా ఉండగా, దేశవ్యాప్తంగా ఆసక్తి కలిగిస్తున్న బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి బీజేపీ గెలుస్తుందని మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. మూడు సార్లు బంగాల్‌ను ఏలిన తృణమూల్ కాంగ్రెస్‌కు ఈసారి నిరాశ తప్పదని వెల్లడించాయి. కొన్ని అంచనాలు మాత్రం తృణమూల్ అధికారం నిలబెట్టుకుంటుందని తెలిపాయి.

# అసెంబ్లీకి సీఎం తాగొచ్చారు

### విపక్షాల సంచలన ఆరోపణలు

చేయాలని, రాష్ట్ర అధిపతి పూర్తిగా మత్తులో ఉన్నప్పుడు సమావేశాలు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని నడిపే వ్యక్తి ఇలాంటి పరిస్థితిలో ఉండటం బాధాకరమని వ్యాఖ్యానించారు. సభలో ఉన్న అందరికీ పరీక్షలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

**'మద్యం సేవించి అసెంబ్లీ సమావేశాలకు రావడం సిగ్గుచేటు'**

మరోవైపు, శిరోమణి దళ్ కూడా భగవంత్ మాన్‌పై తీవ్ర ఆరోపణలు చేసింది. కార్మిక దినోత్సవం రోజునే సీఎం మద్యం సేవించి అసెంబ్లీ సమావేశాలకు రావడం సిగ్గుచేటని పేర్కొంది. పంజాబ్ ప్రజల ముందు నిజం బయటపడేందుకు సీఎంకు వెంటనే డోప్ టెస్ట్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా, రాజ్యసభ సభ్యురాలు స్వాతి మాలీవాల్ కూడా భగవంత్ మాన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం భగవంత్? తరచూ మద్యం సేవించే ప్రభుత్వ కార్యక్రమాలు, బహిరంగ, అధికారిక కార్యక్రమాలకు హాజరవుతున్నారని ఆరోపించారు. పంజాబ్ వంటి సున్నితమైన సరిహద్దు రాష్ట్రానికి సీఎంగా ఉన్న వ్యక్తి ఎప్పుడూ మద్యం మత్తులో ఉండటం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. మద్యం మత్తులోనే ఫైళ్లపై సంతకాలు చేస్తున్నారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయని ఆమె అన్నారు. అయితే, ఎన్నికల ముందు భగవంత్? మాన్?, తాను ఇకపై మద్యం సేవించబోనని తన తల్లిపై ప్రమాణం చేశారని, ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకోలేదని కూడా మాలీవాల్ విమర్శించారు. సీఎంకు మద్యం పరీక్షలు నిర్వహించాలని, అందులో ఆయన మద్యం సేవించినట్లు తేలితే సీఎం పదవి నుంచి దిగిపోవాలని ఆమె డిమాండ్ చేశారు.

**వివాదంపై సభాపతికి లేఖ రాసిన కాంగ్రెస్**

కాగా, ఈ వివాదంపై కాంగ్రెస్ శాసనసభా పక్షం (సీఎల్పీ) అధికారికంగా స్పీకర్‌కు లేఖ రాసింది. సీఎం భగవంత్ మాన్‌తో పాటు అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యేలందరికి ఆల్కో- మీటర్, డోప్ టెస్టులు నిర్వహించాలని అందులో కోరింది. పారదర్శక విధానంలో పరీక్షలు జరగాలని, ఒక గంటలోపే ప్రక్రియ ప్రారంభించాలని సూచించింది. అలాగే పరీక్షలు నిష్పక్షపాతంగా జరిగేందుకు చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్ వైద్య బృందాన్ని నియమించాలని కాంగ్రెస్ కోరింది. అధికార, ప్రతిపక్ష సభ్యులందరికీ సమానంగా పరీక్షలు నిర్వహించాలని పేర్కొంది. అయితే, ఈ గందరగోళంపై సీఎం భగ్వంత్ మాన్ స్పందించారు. కార్మిక దినోత్సవం కోసం ఈ ప్రత్యేక సమావేశం నిర్వహించామని, సభ్యులందరూ వాదనలకు దూరంగా ఉండి హుందాతనాన్ని పాటించాలని ఆయన కోరారు.

# నిజామాబాద్ జిల్లాలో రోడ్డెక్కిన రైతన్నలు..

- పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం



**టి మీడియా, మే 1 , హైదరాబాద్:**
నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డిపల్లిలో ఉద్రిక్తత నెలకొంది. ఇందల్వాయి-ధర్పల్లి మధ్య రహదారిపై రైతులు బైఠాయించారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై కర్షకులు ఆందోళన చేపట్టారు. ధాన్యం తరలింపులోనూ జాప్యం జరుగుతుందంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోళ్లు, బస్తాల తరలింపు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై ధాన్య పోసిన రైతులు ధర్నాకు దిగారు. 15 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆగ్రహించారు.వరి ధాన్యానికి నిప్పుపెట్టి నిరసన తెలిపారు. ఐకేపీ, సొసైటీ అధికారుల తీరుపై రైతులు మండిపడ్డారు. ఆందోళనలో పాల్గొన్న బీజేపీ నాయకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇవాళ వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. క్వింటాలుకు 10 కిలోల చొప్పున తరుగు తీస్తున్నారని, 30 రోజులు గడిచినా ధాన్యం కొనుగోలు చేయడంలేదని సిరికొండ మండల కేంద్రంలో రైతులు ఆందోళనకు దిగారు.

# కూతుర్ని కాపాడి కన్నుమూసిన తల్లి



**టి మీడియా, మే 1 , ఉప్పునుంతల :**
కూతుర్ని కాపాడేందుకు ఓ తల్లి తన ప్రాణాలకు తెగించింది. ఈత నేర్చుకుంటున్న కూతురు మునిగిపోతుందని.. తనకు స్విమ్మింగ్ రాకపోయినా సరే కాపాడేందుకు నీటిలోకి దూకేసింది. అదే నీటిలో మునిగి మరణించింది. నాగర్‌కర్నూలు జిల్లాలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. నాగర్‌కర్నూలు జిల్లా ఉప్పునుంతల మండలం వెల్టూరు గ్రామానికి చెందిన అనూష(35)కు ఇద్దరు పిల్లలు ధనలక్ష్మి(12), అక్షిత (10). భర్త ఐదేళ్ల కిందటే చనిపోవడంతో కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను అనూష పోషిస్తోంది. వేసవి సెలవులు కావడంతో వారిద్దరికీ నీటి గుంతలో ఈత నేర్పించేందుకు తీసుకెళ్లింది. చిన్న కూతురు అక్షిత నడుము కూల్ డ్రింక్ బాటిళ్లు కట్టి గుంతలోకి దింపింది. అయితే నీటిలోకి దిగిన తర్వాత అక్షిత ఏడవడంతో అనూష కంగారుపడిపోయింది. తన కూతురు నీటిలో మునిగిపోతుందేమో అన్న భయంతో గుంతలోకి దూకింది.కానీ అనూషకు కూడా ఈత రాకపోవడంతో అదే నీటి గుంతలో మునిగిపోయింది. దీంతో పెద్ద కూతురు ధనలక్ష్మి పరిగెత్తుకుంటూ వెళ్లి స్థానికంగా ఉన్న రైతులకు సమాచారం ఇచ్చింది. విషయం తెలియగానే హడావుడిగా వచ్చిన వారు.. కూల్‌డ్రింక్ బాటిళ్లతో ఉన్న అక్షితను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఇక ఈత రాకపోవడంతో అనూష నీట మునిగి మరణించింది. తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయి ఇద్దరు పిల్లలు అనాథలుగా మారడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# 'ఇన్‌ఫ్లేషన్ మ్యాన్ మోదీ

- ఓటేసిన తెల్లారే కొరడా
- సిలిండర్ ధరల పెంపుపై కాంగ్రెస్ ఫైర్

**టి మీడియా, మే 1 , ఢిల్లీ బ్యూరో**



దేశంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను పెంచిన నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విరుచుకుపడింది కాంగ్రెస్. ప్రధాని నరేంద్ర మోదీని 'ఇన్?ఫ్లేషన్ మ్యాన్? మోదీ' అంటూ ఎద్దేవా చేసింది. ఏప్రిల్ 29న పోలింగ్ ముగిసిన వెంటనే కేంద్రం వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల ధరలను పెంచడం ఉద్దేశపూర్వక చర్య అని మండిపడింది. తరచూ సిలిండర్ల ధరలు పెంచుతూ వ్యాపారాన్ని భారంగా మారుస్తుందని దుయ్యబట్టింది. ద్రవ్యోల్బణ వీరుడు మోదీ' మరోసారి కొరడా ఝుళిపించారు. మే 1: రూ. 993, ఏప్రిల్ 1: రూ. 218, మార్చి 7: రూ. 115, మార్చి 1: రూ. 31, ఫిబ్రవరి 1: రూ. 50, జనవరి 1: రూ. 111, మొత్తం: రూ. 1,518. అవును, కేవలం 4 నెలల్లోనే వాణిజ్య సిలిండర్ ధర రూ. 1,518 మేర పెరిగింది. ఈ సంవత్సరంలో ఇంకా 8 నెలలు మిగిలే ఉన్నాయి. మోదీ వసూళ్లు కొనసాగుతూనే ఉన్నాయి" అని కాంగ్రెస్? పోస్ట్ చేసింది.

### ఓటేసిన తెల్లారే కొరడా

ఏప్రిల్ 29న పోలింగ్ ముగిసిన వెంటనే కేంద్రం వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల ధరలను పెంచడం ఉద్దేశపూర్వక చర్య అని కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ మండిపడ్డారు. ఇది యాదృచ్ఛికం కాదని, ఒక పద్ధతి ప్రకారం జరుగుతోందని విమర్శించారు. ఈ ధరల పెరుగుదల రెస్టారెంట్లు, టీ దుకాణాల వంటి చిన్న వ్యాపారాలపై ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు.

### 'ఆ రూ.7 మాత్రం ఎందుకు వదిలారు'

మరోవైపు వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల ధరల పెంపుపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సైతం స్పందించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా సామాన్యులకు 'రోటీ-థాలీ' (రొట్టె పళ్లెం) ఖరీదైనదిగా మారుతున్న తరుణంలో ఈ తగ్గింపు చాలా అల్పమని ఎద్దేవా చేశారు. "సిలిండర్లు ఖరీదైనవి కావు. రోటీ-థాలీ ఖరీదైనది అవుతుంది. ఈ విషయం దానిని స్వయంగా కొని తినేవారికి మాత్రమే తెలుసు, ఇతరుల ఇళ్లకు వెళ్లి తినేవారికి లేదా ఇతరుల పళ్లెం నుంచి దొంగిలించేవారికి కాదు. ఒకవేళ వారు సిలిండర్‌ను ఖరీదైనదిగా చేయాలనుకుంటే, దాని ధరను నేరుగా 1000 రూపాయలు పెంచాల్సింది. 1000 రూపాయల్లో 7 రూపాయలు తగ్గించడం ద్వారా ఈ బీజేపీ వాళ్లు ఎవరికి మేలు చేస్తున్నారు? 'ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం'పై బీజేపీ ఎప్పుడు అవిశ్వాస తీర్మానాన్ని తీసుకువస్తుంది?" అని అఖిలేశ్ యాదవ్ అన్నారు. అంతకుముందు పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులతో అంతర్జాతీయంగా ఇంధన ధరలు మండిపోతున్న వేళ కమర్షియల్ గ్యాస్ వినియోగదారులకు చమురు సంస్థలు భారీ షాక్ ఇచ్చాయి. 19 కిలోల కమర్షియల్ ఎ్రా+ సిలిండర్ ధరను ఏకంగా 993 రూపాయల మేర పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. అయితే గృహ వినియోగానికి వాడే డొమెస్టిక్ వంట గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు లేదని అధికారిక వర్గాలు స్పష్టంచేశాయి.

### ఏటీఎఫ్ ధరలు పెంపు

అటు అంతర్జాతీయ విమానయాన సంస్థల కోసం ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) లేదా జెట్ ఇంధనం ధరను శుక్రవారం 5 శాతం పెంచింది. ఇది వరుసగా రెండో నెల పెరుగుదల. ప్రభుత్వ రంగ చమురు సంస్థల ప్రకారం, భారత్?లో అత్యంత రద్దీగా ఉండే దిల్లీ విమానాశ్రయంలో ఏటీఎఫ్ ధరలు కిలోలీటరుకు 76.55 డాలర్లు లేదా 5.33 శాతం పెరిగి 1511.86 డాలర్లకు చేరాయి.మరోవైపు పెట్రోల్, డీజిల్‌తోపాటు దేశీయ విమానయాన సంస్థలకు ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్-ధరల్లోనూ ఎలాంటి మార్పు లేదని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ స్పష్టం చేసింది. అంతర్జాతీయంగా పెరిగిన భారాన్ని తామే భరిస్తున్నట్లు తెలిపింది. అటు డీజిల్ ఎగుమతులపై విండ్‌ఫాల్ పన్నును కేంద్ర ప్రభుత్వం లీటరుకు 23 రూపాయలకు తగ్గించింది. అలాగే, విమానయాన ఇంధనం అయిన ఏటీఎఫ్ ఎగుమతులపై ఈ పన్నును లీటరుకు 33 రూపాయలకి కుదించింది.

# ఉపరితల ఆవర్తన ప్రభావం

- ఏపీలో ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షాలు

**టి మీడియా, మే 1 , అమరావతి బ్యూరో :**
ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాష్ట్రంలోని పలుచోట్ల వర్షాలు కురిశాయి. ఒడిశా నుంచి ఏపీ మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణశాఖ తెలిపింది.విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. కొన్ని రోజులుగా ఉక్కపోత, అధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వాన ఊరటనిచ్చింది. వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నగరంలోని పలు చోట్ల వడగళ్ల వర్షం కురిసింది. పలు చోట్ల వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.అనంతపురం నగరంలో తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. నిన్న సాయంత్రం నుంచే తీవ్ర గాలులు వీచాయి. తీవ్ర ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు రాత్రి పడిన వర్షం కాస్త ఉపశమనాన్ని కలిగించింది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో అరగంట పాటు భారీ వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అయితే ప్రజలకు ఎక్కడ ఇబ్బంది కలగలేదు. వర్షం నీరు ఒక్కసారిగా పెద్ద ఎత్తున రావటంతో కాలువల్లో



చెత్తాచెదారం మురుగు రోడ్డు పైకి చేరింది. విద్యుత్ సమస్య ఏర్పడిన ప్రాంతాల్లో విద్యుత్ అధికారులు మరమ్మత్తులు చేపడుతున్నారు.ఒక్కసారిగా మారిన వాతావరణం : శ్రీకాకుళం జిల్లా అంతటా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. జిల్లాలో తెల్లవారుజాము నుంచే పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, సారవకోట, మెళియాపుట్టి, కొత్తూరు మండలాల్లో వాన కురిసింది. ఆమదాలవలస, సరుబుజ్జిలి, పొందూరు, టెక్కలి, జలుమూరు ,కోటబొమ్మాళి, సారవకోట, నందిగాం, ఎల్.ఎన్ పేట, హిరమండలంతో పాటు మరికొన్ని మండలాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురియడంతో ప్రయాణికులు ప్రజలు రైతులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ సాయంత్రం ఒక్కసారి మేఘావృతంలో వాతావరణం మారి ఈదురుగాలతో కూడిన భారీ వర్షం కురిసింది. రోడ్లపై ఉన్న చిన్న చిన్న దుకాణాలు, తోపుడి బళ్లు గొడుగులు గాలికి ఎగిరిపోయాయి. భారీ వర్షానికి చెట్లు కొమ్ములు వీరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్తు అంతరాయం ఏర్పడింది.

**వందల ఎకరాల్లో అరటి పంట నేలమట్టం**

కడప జిల్లా లింగాల మండల పరిధిలోని గుణకనపల్లి, రామట్లపల్లి, చిన్నకుడాల, మురారిచింతలతో పాటు పలు గ్రామాల్లో గురువారం రాత్రి వీచిన వాన గాలులకు వందల ఎకరాల్లో అరటి పంట నేలమట్టమైంది. దీంతో ఉద్యానవన శాఖ అసిస్టెంట్ యువతేజ నేలమట్టమైన అరటి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గురువారం రాత్రి కురిసిన ఈదురు గాలులు, అకాల వర్షానికి సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. చాలా మంది రైతులు సాగు చేసిన అరటి తోటలు పూర్తిగా నేలకు ఒరిగాయని తెలిపారు. కాపు దశలో ఉన్న పంట నాశనం కావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందే విధంగా అధికారులు కృషి చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

# శుభక్షేత్ర వెంచర్ పేరుతో డబ్బులు వసూలు

- మంగ్లీ సోదరుడి పాత్రపై ఆధారాలు!

**టి మీడియా, మే 1 , హైదరాబాద్ బ్యూరో :**
శుభక్షేత్ర వెంచర్ పేరుతో రూ.కోట్లలో వసూలు చేసిన కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు రమావత్ మధు సినీ గాయని మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగాయని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో శివచౌహాన్ ఇప్పటివరకూ పాత్ర గుర్తించలేదు. ఇద్దరి మధ్య బ్యాంకు లావాదేవీల్ని పోలీసులు తాజాగా గుర్తించారు. ఇవి మోసానికి సంబంధించినవేనా? ఇతర లావాదేవీల నగదా అనేది ఇంకా నిర్ధారణ కాలేదని, దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రమావత్ మధు, శివచౌహాన్ మధ్య లావాదేవీలు జరిగిన సమయం, కారణాల మీద ఆరా తీస్తున్నారు.

**16 ఎకరాల్లో శుభక్షేత్ర వెంచర్**

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం దామరగిద్ద గ్రామంలో డీటీసీపీ అనుమతితో 16 ఎకరాల్లో శుభక్షేత్ర వెంచర్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించి మొత్తం 31 మంది దగ్గర రూ.6.58 కోట్లు వసూలు చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది మార్చిలో ఈవోడబ్ల్యూ పోలీసులు కేసు నమోదు చేశారు. రమావత్ మధు, హేమకాంత్‌రెడ్డి, బండి



శివకుమార్, భరత్, శైలజ తదితరుల మీద కేసు నమోదు చేసిన దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు తాజాగా రమావత్ మధును అరెస్టు చేశారు. ఈ మోసం విలువ దాదాపు రూ.20 కోట్ల వరకూ ఉంటుందని పోలీసులు గుర్తించారు. నిందితులు ఈ డబ్బు ఏం చేశారో ఆరా తీస్తున్నారు. గత ఏడాది నల్గొండ జిల్లా పీఏపల్లి ఠాణాలో నమోదైన గోకులానంద ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మోసం కేసులోనూ రమావత్ మధు కీలక నిందితుడుగా ఉన్నట్లు పోలీసులు తెల్చారు.

**రూ.10 కోట్ల వరకూ వసూలు**

తాజాగా పంజాగుట్టలో పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాది సింగపోగు సుబ్బారావు ఫిర్యాదుతో నమోదైన కేసులోనూ రమావత్ మధు నిందితుడు. ప్రముఖ గాయని మంగ్లీ, రమావత్ మధు, భరత్‌చౌహాన్, శైలజ చౌహాన్, శివ తదితరులు 100 నుంచి 150 మంది దగ్గర తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభాలు ఇస్తామంటూ రూ.10 కోట్ల వరకూ వసూలు చేశారని సుబ్బారావు ఈ ఏడాది మార్చి 27వ తేదీన ఫిర్యాదు ఇచ్చారు. పోలీసులు మంగ్లీ సహా మిగిలినవారి మీద కేసు నమోదు చేశారు. పంజాగుట్టలో నమోదైన కేసులోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు మధును నాలుగు రోజుల కస్టడీకి తీసుకోన్నారు.


**ఖాతాల గురించి ఆరా**

ఈ నెల 16వ తేదీన అరెస్టైన రమావత్ మధును సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు బుధవారం నాలుగు రోజుల కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. శనివారం వరకు కస్టడీ ఉన్నందున ఈ లోపు ఎవరెవరితో లావాదేవీలు జరిగాయో గుర్తిస్తామని అధికారులు వివరించారు. ఇప్పటికే రమావత్ మధు ఖాతాలను స్తంభింపజేసిన పోలీసులు ఇతరుల ఖాతాల గురించి ఆరా తీస్తున్నారు. పరారీలో ఉన్న నిందితులు హేమకాంత్‌రెడ్డి, బండి శివకుమార్, భరత్, శైలజ ఇతరుల కోసం గాలిస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

# ట్రంప్ హత్యాయత్నం కేసు

### కీలక వీడియోను విడుదల చేసిన అమెరికా న్యాయశాఖ

**టి మీడియా, మే 1 , ఢిల్లీ బ్యూరో :**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించిన ఒక కీలక వీడియోను అమెరికా న్యాయశాఖ తాజాగా విడుదల చేసింది. గత వారాంతంలో జరిగిన ఈ ఘటనలో నిందితుడు అలెన్, భద్రతా వలయాన్ని ఎలా ఛేదించుకుని వచ్చాడనేది ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. హోటల్‌లో ఏర్పాటు చేసిన సెక్యూరిటీ చెక్‌పాయింట్ గుండా నిందితుడు అత్యంత వేగంగా దూసుకువచ్చి, ఒక్కసారిగా కాల్పులు జరపడం ఈ వీడియోలో రికార్డ్ అయ్యింది. విడుదల చేసిన ఫుటేజ్‌లో అలెన్ దాడికి ఒక రోజు ముందు హిల్టన్ హోటల్‌లోని ప్రాంతాన్ని పరిశీలిస్తున్నట్లు కూడా కనిపిస్తుంది. దీని ఆధారంగా ఈ ఘటన ముందస్తు ప్రణాళికతో జరిగిందని ప్రాసిక్యూటర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కాల్పుల్లో అక్కడ విధుల్లో ఉన్న ఒక సీక్రెట్ సర్వీస్ అధికారికి గాయాలయ్యాయి. ప్రస్తుతం ఈ కాల్పుల ఘటనపై సమగ్ర విచారణ కొనసాగుతోందని, ఆ దర్యాప్తులో భాగంగానే ఈ వీడియోను విడుదల చేసినట్లు అమెరికా అధికార వర్గాలు వెల్లడించాయి.వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్ సందర్భంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నానికి సంబంధించిన ఫుటేజ్‌ను డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియా యూఎస్ అటార్నీ జీనైన్ ఫెర్రిస్ పిర్రో గురువారం విడుదల చేశారు. "వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో అధ్యక్షుడిని హత్య చేసే ప్రయత్నంలో కోల్ అలెన్ ఒక యూఎస్ సీక్రెట్ సర్వీస్ అధికారిని కాల్చడాన్ని చూపిస్తున్న వీడియోను విడుదల చేస్తున్నాం. ఈ వీడియోను ఇప్పటికే యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టుకు అందించాము. ఈ కాల్పులు స్నేహపూర్వక కాల్పుల



(ఫ్రెండ్లీ ఫైర్) ఫలితంగా జరిగాయని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేవు. నా కార్యాలయంతో పాటు ఫెడరల్ దర్యాప్తు అధికారులు ఈ కేసును ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. కోల్ అలెన్‌ను న్యాయస్థానం ముందు నిలబెట్టడానికి ఖీదీ×తో కలిసి ఈ విస్తృతమైన దర్యాప్తు చేస్తున్నాం." అని ఆమె పేర్కొన్నారు.

మరిన్ని అభియోగాలు నమోదయ్యే అవకాశం!

ఇదిలా ఉండగా, వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్ కాల్పుల ఘటనలో 31 ఏళ్ల నిందితుడైన కోల్ టోమాస్ అలెన్‌పై దర్యాప్తు కొనసాగుతుందని అధికార వర్గాలు తెలిపాయి. న్యాయ శాఖ మూడు ఫెడరల్ అభియోగాలను దాఖలు చేసిందని అమెరికా తాత్కాలిక అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచే తెలిపారు. ఈ అభియోగాల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేయడానికి ప్రయత్నించడం, నేరం చేయడానికి రాష్ట్రాల మధ్య ఆయుధాన్ని రవాణా చేయడం, హింసాత్మక నేరం, ఆయుధాన్ని కాల్చడం వంటివి ఉన్నాయని చెప్పారు. ఇంకా మరిన్ని అభియోగాలు నమోదయ్యే అవకాశం కూడా ఉందని ఆయన పేర్కొన్నారు.

వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో ఇటీవల నిర్వహించిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో నిందితుడు అలెన్ కాల్పులకు పాల్పడ్డాడు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ అపాయం జరగలేదు. సీక్రెట్ సర్వీస్, ఇతర భద్రత అధికారులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నాయి. నిందితుడి నుంచి పలు కత్తులను, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. కాల్పుల ఘటన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియాతోపాటు ఉపాధ్యక్షుడు జేడీవాన్స్, రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్, విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియోను అక్కడి నుంచి తరలించారు. నిందితుడు అలెన్ వద్ద 12-గేజ్ పంప్ యాక్షన్ షాట్‌గన్, రాక్ ఐలాండ్ ఆర్మరీ 1911.38 క్యాలిబర్ పిస్టల్, మూడు కత్తులు ఉన్నాయని అధికారులు తెలిపారు. : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించిన ఒక కీలక వీడియోను అమెరికా న్యాయశాఖ తాజాగా విడుదల చేసింది. గత వారాంతంలో జరిగిన ఈ ఘటనలో నిందితుడు అలెన్, భద్రతా వలయాన్ని ఎలా ఛేదించుకుని వచ్చాడనేది ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. హోటల్‌లో ఏర్పాటు చేసిన సెక్యూరిటీ చెక్‌పాయింట్ గుండా నిందితుడు అత్యంత వేగంగా దూసుకువచ్చి, ఒక్కసారిగా కాల్పులు జరపడం ఈ వీడియోలో రికార్డ్ అయ్యింది. విడుదల చేసిన ఫుటేజ్‌లో అలెన్ దాడికి ఒక రోజు ముందు హిల్టన్ హోటల్‌లోని ప్రాంతాన్ని పరిశీలిస్తున్నట్లు కూడా కనిపిస్తుంది. దీని ఆధారంగా ఈ ఘటన ముందస్తు ప్రణాళికతో జరిగిందని ప్రాసిక్యూటర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కాల్పుల్లో అక్కడ విధుల్లో ఉన్న ఒక సీక్రెట్ సర్వీస్ అధికారికి గాయాలయ్యాయి. ప్రస్తుతం ఈ కాల్పుల ఘటనపై సమగ్ర విచారణ కొనసాగుతోందని, ఆ దర్యాప్తులో భాగంగానే ఈ వీడియోను విడుదల చేసినట్లు అమెరికా అధికార వర్గాలు వెల్లడించాయి.వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్ సందర్భంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నానికి సంబంధించిన ఫుటేజ్‌ను డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియా యూఎస్ అటార్నీ జీనైన్ ఫెర్రిస్ పిర్రో గురువారం విడుదల చేశారు. "వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో అధ్యక్షుడిని హత్య చేసే ప్రయత్నంలో కోల్ అలెన్ ఒక యూఎస్ సీక్రెట్ సర్వీస్ అధికారిని కాల్చడాన్ని చూపిస్తున్న వీడియోను విడుదల చేస్తున్నాం. ఈ వీడియోను ఇప్పటికే యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టుకు అందించాము. ఈ కాల్పులు స్నేహపూర్వక కాల్పుల (ఫ్రెండ్లీ ఫైర్) ఫలితంగా జరిగాయని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేవు. నా కార్యాలయంతో పాటు ఫెడరల్ దర్యాప్తు అధికారులు ఈ కేసును ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు.